


**జల్లులు జల్లులుగా కురుస్తోంది వాన.**

**నాలుగు రోజులుగా ఇదే వరస.**

**జల్లులాగవు. భారీ వర్షం రాదు.**

**చొక్కా జేబులో నుండి 'కరుకు' (అంతకు ముందే సగం ఊదేసి దాచిపెట్టుకున్న బీడీ) తీసుకొని, అగ్గిపెట్టె కోసం తడుముకున్నాడు అనంతయ్య.**

పుల్లలు లేని పెట్టె ఇంట్లో సరుకులు నిండుకోవడాన్ని గుర్తుకు తెచ్చింది. కడుపులో పేగుల్ని మెలిపెట్టిన బాధ.

"ఇంగులముంగటే ఇయ్యి." తనకెదురుగా అంతే దిగులుగా కూర్చున్న పెళ్లాన్నుద్దేశించి అడిగాడు.

"పొద్దుగాల ఛాయ్ జేసుకున్నంక మల్ల పొయ్యి దిక్కు జూడకనే పోతి." మొగుడి కళ్లలోకి చూడలేకపోయింది అంజమ్మ.

"ఇంత దరిద్రమొచ్చిందేమే?" అనంతయ్య నిట్టూర్పులో విసుగు స్పష్టంగా కనిపిస్తున్నది.

"ఆ మేస్త్రి లం ... కొడుకు ఇగనైన లియ్యడంటనా?" అంజమ్మ ఆవేదనలో కోపం.

ఎండాకాలంలో రెండ్రోజుల కూలీ డబ్బులు ఎగ్గొట్టాడు రాజన్న మేస్త్రీ. డబ్బులు లేనప్పుడల్లా అవి గుర్తొస్తాయి అనంతయ్య దంపతులకు. ఎప్పటి కప్పుడు తప్పించుకోవడంలో రాజన్న నిష్ణాతుడాయె.

"ఆ కొడుకును చింతపండు గొట్టినట్లు కొట్టాలే. వాని గారపండ్లు రాలగొట్టాలే. మొఖమ్మీద కాకరిచ్చి ఉమ్మెయాలే. లం ... కొడుకు." అనంతయ్య మూగ వేదన కళ్లల్లో అరుణిమను తెచ్చింది.

"అడిగొస్త!" అంటూ తువ్వాలు తలమీదికి సర్దుకున్నాడు.


"వాన జెర్ర తవుకైనంకపోరాదు?" అంతటి దరిద్రంలో కూడా భర్త మీద ప్రేమ, అతని నిస్సహాయత పట్ల జాలీతో నిలువరించ లేకపోయింది.

పెళ్లాం మాట లెక్క చేయకుండా అరిగిన చెప్పుల్లోకి కాళ్లు దూర్చాడు అనంతయ్య. అంతలో ...

వర్షాన్ని తరుముకొస్తున్న గాలిలా గుడిసెలోకి పరుగెత్తుకొచ్చాడు నర్సీమడు, నాలుగో తరగతి చదూతున్న అనంతయ్య పెద్దకొడుకు.

"ఇస్కోలు యిడిసి పెట్టినారా? పోయిన తడువే లేదు ఉరుకుతొచ్చినవు?" కొడుకు ప్రవర్తన పట్ల తండ్రి అసహనం.

"జెర వాన ఎలిసినంక రావొద్దా కొడకా!" అంజమ్మ తన చిరుగుల కొంగుతో నర్సీమని తల తుడవసాగింది.




"అడిగిందానికి జవాబియ్యవేందిరా?" భార్య కొడుకును వెనకేసుకురావడం చిరాకు కల్గించింది అనంతయ్యకు.

తల్లి కొంగులో నుండి గబుక్కున తల బయటికి పెట్టాడు. తండ్రి వైపు గుడ్లప్పగించాడు. "ఇస్కూల్ల పాటాలు జెప్పలేదు. ఆకలైతున్నదని ఇంటి కొచ్చిన." అని చెప్పలేకపోయాడు వాడు.

"ఏమిందిరా! గట్ల గుడ్లు మిటకరిస్తవు?" కొడుకు మౌనం అనంతయ్యను రెచ్చగొడుతున్నది. వాని జబ్బ పట్టి పైకెత్తాడు.

బిక్కమొగమేశాడు వాడు.

"ఎందుకొచ్చివవ్ ఇంత జెల్ది?" మరింత కోపంగా అడిగాడు.

"అరె, ఎక్కడి కోపమో దీస్కొచ్చి పిలగాని మీద జూపిస్తవా?" జరిగే పరిణామాన్ని పసిగట్టింది తల్లి మనసు.

"నువు నోరుమూసుకో! గీలుచ్చ, రేపటికి ఏరిగి పెద్దడంటానే గద పనికి పోనియ్యకుండా ఇస్కోలుకు పంపుతున్నం. మరి గీ గాడిది కొడుకు గక్కడ ఇస్కోలుకు పోక, గిక్కడ పనికి రాక ... ఆ.." నియంత్రణ కోల్పోయిన ఆవేశం కార్యరూపం దాల్చింది. నర్సీమని గూబ గుయ్ మంది.

ఏడ్చే ఓపిక కూడా లేని నర్సీమడు గుక్క పడ్తూ కూలబడిపోయాడు.

"అడ్డమైనోల్ల మీది కోపం పసి పిలగాని మీద జూపిస్తవా? ... ఎవ్వరినని ఏం లాబం? అస్సలు నా వొంతు బాగాలేదు." తన మీద తనకే జాలి కల్గిన వారిని ఈ లోకంలో ఏ శక్తీ ఆదుకోలేదన్న నిజానికి నిదర్శనం అంజమ్మ కళ్లల్లో నీళ్లు.

గుండెలోని మంటను తట్టుకోలేక, విసవిసా వర్షంలోకి వెళ్లిపోయాడు అనంతయ్య.

సన్నని తుంపర్లు రాలుతున్నాయ్.

బడి పిల్లలంతా ఆ చిను కుల్లో ఆడుకుంటున్నారు.

కబడ్డీ, మార్పేట్ ఒక ప్రక్క. విరిగిన బెంచీ కర్రను బ్యాట్ చేసుకుని, గోడకు మూడు చారలు గీసి క్రికెట్ మరో పక్క. ఇంకోవైపు తడిసిన నేల మీద గళ్లు గీచి చిక్కుడు బిళ్ల ఆడుకుంటున్నారు ఆడపిల్లలు.

నర్సీమడు ఏ ఆటైనా బాగా ఆడగలడు. కాని గత రెండ్రోజులుగా తండ్రి మాటలు మనసును తొలిచేస్తుంటే గెడ్డానికి రెండు చేతులాన్చుకుని అదే ఆలోచిస్తున్నాడు.

కోడి తన పిల్లల్ని రెక్కల మాటున దాచు కున్నట్లు తండ్రి తనను గుండెలో పొదువుకుని ...

"సూడు బిడ్డా! కన్నమ్మ కష్టాలు పడి మిమ్మల్ను పెంచుతున్నం. మనకు తాతలు సంపాయించి పెట్టిన ఆస్తి లేదు. రెక్కాడితేనే డొక్కాడ్తది. మాకు జెప్పేటోడు లేక, మా పెద్దలకు తెలివి లేక మా బతుకులు గిట్లైనై. మీరన్న మంచిగ జదువుకోని ఏమన్న నౌకిరి చేస్తే మీ బతుకే మంచిగుంటది కొడుకా! సదువు మీద మనసుపెట్టక, ఊకే గిట్ల దిరిగితే గక్కడ సదువురాదు, గిక్కడ గీపని రాదు. ఏమి రాక పోతే ఎట్ల బతుకుతరు చెప్పు?"

నాయిన గట్ల మాట్లాడుతుంటే నోట్ల కెల్లి మాటరాలే. కండ్లల్ల నీల్లు దిర్గినయ్. గొంతు పచ్చిగయ్యింది. ఎంత కష్టమొచ్చినా సరే బాగా జదువుకోవాలనిపిచ్చింది.

"ఏందిరా నర్సీమా! పరిషాన్ జేస్తున్నవ్?" ఏడో తరగతి చదువుతున్న రాంచెంద్రి పలకరించాడు.

"లేదన్నా, ఏం లేదు. ఉత్తగనే!" పొడి పొడి సమాధానం నర్సీమడిది.

నర్సీమడి పక్కనే కూర్చున్నాడు రాంచెంద్రి.

"మన ఇస్కూల్ దెరిసి ఎన్నిదినాలైందన్నా?" అడిగాడు.

"జూలై ... 12 ... 13 ..." అంటూ వేళ్లు లెక్కబెట్టి చెప్పాడు "నలుపై తొమ్మిది దినా లైందిరా!"

"మీకు పాటాలు జెపుతున్నరు గదన్నా! మాకింక మొదులే పెట్టలేదు." నర్సీమడి మాటల్లో దిగులు.

"మాకేడ మొదులు పెట్టిన్రురా? తెలుగుసార్ ఒక్క పాఠం జెప్పిండు. ఇంక ఏ సార్ షురువు జెయ్యలేదు." చాలా తేలిగ్గా అనేశాడు రాంచెంద్రి.

"ఈ సముచ్చరము మీరు పెద్ద పరిచ్చల్ రాసేదుంటదేమో గదన్నా, మరి పాటాలు ఇంక మొదులు పెట్టకపోతే కష్టం గాదా?" అమాయకంగా అడుగుతున్న నర్సీమడికి సమాధానంగా మధ్యాహ్నం తరగతుల్లోకి ఆహ్వానించింది బడి గంట.

"ఊఁ! ఈయాల్ల గూడ బాగనే వొచ్చిన్రురో!" 'అటెండెన్స్ రిజిస్టర్ మూసేస్తూ బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు నిజాముద్దీన్. ఆ ఊళ్లోని అప్పర్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయ పంచకంలోని ఓ జీవి.



మొక్కు

గుమ్మంలో నిలబడి భర్త కోసం ఎదురు చూస్తున్న అలివేలు గుండుతో ఉస్సురంటూ వస్తున్న భర్తని చూసి కంగారు పడింది !..

"ఇదేమిటండీ"

"కంగారు పడకు ! మా మేనేజరు తనకి ప్రమోషన్ వస్తే ..... నాజుట్టు ఇస్తానని మొక్కు కున్నాడట" అని చెప్పాడు భర్త !

- దుర్గ

విద్యార్థులంత మేష్టారేంజెబుతారో వినాలన్న ఆసక్తితో నిశ్శబ్దంగా చూస్తున్నారు, ఆయనవైపే.

పిల్లలకు ఇచ్చకాలు జెప్పడంలో గొప్ప పేరుంది నిజాముద్దీన్‌కి. పల్లెటూళ్లో పుట్టడం వల్ల తెలుగు బాగా మాట్లాడగల్గటం, దానికి తోడు మంచి 'లోక జ్ఞానం'. సమయోచిత సంభాషణల్తో ఇటు పిల్లల మనసుల్ని ఆకట్టుకుంటూ, అటు గ్రామీణుల ప్రశంసలను పొందుతూ, లౌక్యుడిగా తోటి వారి నాలుకల్లో నిలిచిపోయాడు.

"పెసర్‌గాయలు బలిసినాయిరా?" నిశ్శబ్దాన్ని చెదరగొట్టాడు.

తరగతి గది ఒక్కనిముషం గుసగుసల్తో నిండిపోయింది.

"ఏమైందిరా? ఒక్కడు జవాబు జెప్పడూ?" బల్లమీద బెత్తాన్ని తాటించాడు.

"బలుస్తున్నది సార్!" సాయిలు జారిపోతున్న నిక్కర్ సర్దుకుంటూ లేచి నిలబడ్డాడు చేతులు కట్టుకుని.

"మరి మీరే దింటార్రా? మీ సార్లకేమీ ఇచ్చేది లేదా?"

మరోసారి నిశ్శబ్దం.

"పుణ్యానికే మొద్దురా! పైసలిస్తం!" ఎక్కడ కొట్టాలో బాగా తెల్సు పంతులికి.

"పైసలెందుకు సార్? మే దెచ్చియ్యమా!" రంగారెడ్డి పటేల్ కొడుకు రాజేందర్ రెడ్డి అన్నాడు అభిమానంగా.

"అంటే, మేం తెచ్చియ్యిమంటాని మిమ్లను అడుక్కోవాలె. గప్పుడు మీకె అక్కెర గల్గి ఇంత దెచ్చేస్తరన్నట్లు. గంతే గదరా?" రెచ్చగొట్టాడు సారు.

"గదేంది సార్, గట్లంటవు?" మా అభిమానం దెబ్బతిన్నదన్నట్లు లేచాడు శ్రీను.

ఈ వాతావరణం ఏమాత్రం మింగుడు పడట్లేదు చివరి బెంచీలో కూర్చున్న నర్సిమడికి.

"... ఇయ్యాల్ల గూడ పాటం జెప్పవా సార్?" అడగాలా వద్దా అనే సంకోచం నుండి ఆవేశం బయట పడేసినా, తన గుండె చప్పుడు తనకే వినిపిస్తున్నది.

"ఎవఁడ్రా వాడు?" హఠాత్తుగా నిజాముద్దీన్ కంఠంలోని గర్జనకు స్థాణువులయ్యారు పిల్లలు.

కలకల మంటున్న వాతావరణం గంభీరంగా మారింది క్షణాల్లో.

"ఎవఁడ్రా వాడు? దమ్ముంటే లేసిమాట్లాడురా!' ' నిజాముద్దీన్ కోపంతో ఊగిపోతున్నాడు.

"నర్సిమడు సార్!" పక్కనే కూర్చున్న యాదయ్య చెప్పాడు మెల్లగా.

"అరేయ్! గాడిదీ! లేవురా! ఏమన్నావురా?' ' కళ్లల్లో ఎరుపు.

భయంభయంగా లేచాడు నర్సిమడు.

"పాటం జెప్పుమంటానన్న సార్!" అంత భయంలోనూ చెదరలేదు వాని వాలకం.

"ఊహు! ఏందొరా? పాటము చెప్పాలెనా? మంచిది దొరా!" మూతి ముందుకు సాచి, వ్యంగ్యంగా దీర్ఘం తీస్తూ, బెత్తం చేతిలో ఆడించు కుంటూ నర్సిమడి వైపు కదిలాడు.

విద్యార్థులంతా జరగబోయే సంఘటనను ఊహించుకుంటూ, గుండెలు చిక్కబట్టుకుని, కళ్లార్పకుండా చూస్తున్నారు. ఆడపిల్లలు ముందే చెవులు మూసికొన్నారు.

"పాఠం ... చెప్పుత! పాఠం ... జెపుత! పాఠం ... జెప్త! పాఠం ... జెప్త!" అంటూ వత్తి పలుకుతూ, క్రమేపీ చేతిలోని బలాన్ని పెంచుతూ అందిన చోటల్లా బాదసాగాడు.

"ఇకనైనా ఆపెయ్" అన్నట్లు చేతిలోని బెత్తం ముక్కలు ముక్కలైంది.

"థూ! అందుకే గిట్ల నాశనమై పోతున్నారురా! దక్కలి కొడుకులు" అసహ్యంగా అరుస్తూ, తన కుర్చీలోకెళ్లి కూలబడ్డాడు నిజాముద్దీన్. ఆపై యథాలాపంగా లోకం పోకడను గూర్చి ఓ అయిదు నిముషాలు నిరంతరాయంగా ఉపన్యసించాడు.

నర్సిమడి దుఃఖం ఇంకా ఆగలేదు. అప్పుడప్పుడు వెక్కుతూ, ధారాపాతంగా వర్షిస్తున్న కన్నీళ్లనాపుకునేందుకు, ముంజేతులతో వ్యర్థ ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.


నిజాముద్దీన్ ఆవేశం చల్లారలేదు.

"ఓ'గ్రా నేను పాఠం జెప్పను. ఇస్కూల్ దెరిసి రెండు నెల్లు గాదు, నాలుగు నెల్లైనా జెప్పను, అసలు ఈ యాడాదంత జెప్పనే జెప్పను. నీవెవ్వడవురా అడగనీకె? కొడుకా! జీతం నీ జేబుల కెల్లి దీసిస్తున్నావుర? నాలిక జీర్తె అచ్చిరం రాదు కొడుకులకు, కానూన్లు మాట్లాడ్తరు. చెప్పిన పాఠం ఎన్నడన్న యాజ్జెయ్యనీకొచ్చిందా ఈ మొకాలకు? అది రాదు. పాటం జెప్పాలెనంట. మరి వీడు గింత సక్రమంగ జదివి కలెక్టర్ సాబైతడో? ప్రైమ్మినిస్టరే అయితడో?

"అరె, నా ఇరవైయ్యేండ్ల సార్వీసుల ఒక్క ఆఫీసర్ గూడ ఈ మాటనలేదు. ఈయాల్ల నీ ...

"అరేయ్ కొడుకా! ఇంత మంది మందిల జెపుతున్న. ఇది ఆగస్టు నెల గద. ఇంక ఎనిమిది నెల్ల దాంక గూడ నేను పాఠం జెప్పన్రా. నీవు ఎవ్వనికి జెప్పుకుంటవో చెప్పుకో. ఎవ్వడొక్క యెంటిక గూడ పీక్కోడు ..." కోపం దిగజార్చిన సంస్కృతికి ప్రతీకగా ఆపై ఏమేమో మాట్లాడాడు నిజాముద్దీన్.

ఆ పసి హృదయాలు అయోమయం నుండి తేరుకోలేదు. పీరియడ్ మార్పుకు సూచకంగా గంట మ్రోగింది.



*